క్లుప్తంగా

ఉగ్రవాదుల దాడిపై నిరసన ర్యాలీ



తెలకపల్లి: కశ్మీర్‌లోని పహెల్గాంలో ఇటీవల ఉగ్రవాదులు పర్యాటకులను కాల్చి చంపడంపై ఆదివారం హిందు సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని దాసుపల్లి గ్రామం నుంచి అంబేడ్కర్ చౌరస్తా మీదుగా ప్రధాన కూడలి నెహ్రూ చౌరస్తా వరకు భారీ ర్యాలీ చేపట్టారు. మతం పేరుతో హిందువులను కాల్చి చంపడం దారుణమన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు అందరు మద్దతు తెలపాలన్నారు. వీర మరణం పొందిన సైనికులకు నివాళులర్పించారు. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో రాజేష్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, చిన్నారెడ్డి, రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరేందచారి, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా రజక వృత్తిదారులకు సంబంధించిన కరెంట్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి అన్నారు. తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గోవిందు బాలస్వామి అధ్యక్షతన జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన జిల్లా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ వ్యాప్తంగా రజక వృత్తిదారులకు బ్యాంకుల్లో ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షలు రుణాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ఆంజనేయులు జిల్లా ఉపాధ్యక్షుడు బాలకృష్ణ మండల అధ్యక్షుడు కొత్త మల్లేష్, జిల్లా కార్యదర్శి సురేష్, జిల్లా సంయుక్త కార్యదర్శి రాములు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి



పెంట్లవెల్లి: ఈ నెల 20న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ కోరారు. ఆదివారం మండలంలోని గోపులాపూర్‌లో గ్రామస్తులతో సమావేశం అయ్యారు. సమ్మెలకు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన లేబర్‌కోడ్స్‌ను రద్దు చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈశ్వర్, హనుమంతు, శ్రీను, కురుమయ్య, లక్ష్మీదేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

కందనూలు: నాగర్‌కర్నూలు జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ సమీపంలోని ఏబీసీ మైదానంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు శిబిరం ఇన్‌చార్జ్‌లు మొహమ్మద్ మోసిన్, సతీష్‌లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు సెల్: 6302006138 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ నెల 13వ తేదీ ఉదయం 9:00 వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

వెల్దండ: మండలంలోని రాచూర్‌లో ప్రీమియర్ లీగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ప్రథమ స్థానంలో గోకమళ్ల ఫైటర్స్ జట్టుకు రూ.30వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన చేతన స్ట్రైకర్స్ జట్టుకు రూ.20వేల నగదు, తృతీయ స్థానంలో నిలిచిన శివాజీ వారియర్స్ జట్టుకు రూ.15 వేల నగదుతో పాటు షీల్డ్ అందజేశారు. నాయకులు సంజీవ్‌కుమార్‌యాదవ్, కరుణాకర్, నిర్వాహకులు గోకమళ్ల రాజు, మల్లోజు రాము, కృష్ణమాచారి, శ్రావణ్, ప్రశాంత్, సాయి, వెంకటేష్, నాగరాజు, అనిల్, ప్రహ్లాద్, రవి, వెంకటేష్, రణం, నాయకులు పర్వతాలు ఉన్నారు.



వసతుల కల్పనలో అలసత్వం

- ఎండలకు అల్లాడుతున్న కూలీలు
- పట్టించుకోని అధికారులు


ఉప్పునుంతలలో రైతు పొలంలో భూమి చదును పనులు చేస్తున్న కూలీలు

ఉప్పునుంతల: మండలంలో కొనసాగుతున్న జాతీయ ఉపాధిహామీ పనుల వద్ద అధికారులు కనీస వసతులు కల్పించడం లేదు. పనుల వద్ద తాగునీరు, నీడ వసతి లేక పోవడంతో కూలీలు ఎండలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది ఎండలు తీవ్రంగా ఉండటంతో కొన్ని గ్రామాల్లో కనీసం పనుల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా అందుబాటులో ఉంచకుండ నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు లేకపోవడంతో కూలీలు ఉపాధి పనుల వైపు మొగ్గుచూపుతున్నారు. గ్రామాల్లో అధిక సంఖ్యలో పనులకు వెళ్తున్నారు. ఏ గ్రామంలో చూసినా వందల సంఖ్యలో కూలీలు పనులు చేస్తూ పొలాల్లో కన్పిస్తున్నారు. భూమి చదును, చెట్ల తొలగింపు, ఫీడర్ చానల్ పనులు, కేఎల్ఐ పిల్ల కాలువ వెంట చెట్లను తొలగిస్తూ పూడిక మట్టిని తీసే పనులు చేస్తున్నారు. కూలీలకు చేసిన పనులకు రెండు వారాలకు ఒకసారి వేతనం డబ్బులు ఇవ్వాల్సి ఉండగా నాలుగైదు వారాల డబ్బులు పెండింగ్‌లో ఉంటున్నాయి. కొంతమంది కూలీలకు గతేడాది చేసిన పనులకు సంబంధించిన డబ్బులు అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

దీంతోపాటు ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లకు నెలనెలా వేతనం సరిగా రాకపోవడంతో పనులపై వారు శ్రద్ధ చూపడంలేదు.

ప్రతియేటా అవే పనులు..

ఈజీఎస్ పథకాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడానికి పాలకులు, అధికారుల పట్టింపు ఏమాత్రం లేదు. ఈ పథకంలో నిర్దేశించిన విధంగా 266 రకాలు పనులను చేపట్టే అవకాశం ఉంది. రైతుల్లో అవగాహన కల్పించకపోవడంతో కేవలం పది రకాల పనులకు మించి చేయడం లేదు. ప్రతియేటా కేవలం భూమి చదును, చెట్ల తొలగింపు, నీటి నిలువ గుంటలు తదితర భూ అభివృద్ధి పనులే చేస్తున్నారు. తోటల పెంపకం, ఇతర పనులపై అంతగా ఆసక్తి చూపడంలేదు. మండలంలో మొత్తం 10029 జాబు కార్డులు ఉండగా వాటిలో 6177 జాబ్ కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. మొత్తం కూలీలు 20700ల మంది ఉన్నారు. ఈ 2025–26 ఆర్థిక సంవత్సరానికిగాను 2.35 లక్షల పనిదినాలు కల్పించాలనే లక్ష్యంతో ఉన్నామని ఇన్‌చార్జ్ ఏపీఓ పర్వతాలు తెలిపారు. తిప్పాపూర్ మినహా ప్రస్తుతం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పనులు కొనసాగుతున్నాయి. దాదాపుగా 2 వేల పైచిలుకు మంది కూలీలు పనులు చేస్తున్నారని ఏపీఓ తెలిపారు.

ఎండల తీవ్రతపై అవగాహన లేదు..

ప్రస్తుతం ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని సంబంధిత ఈజీఎస్ అధికారులు కూలీల్లో అవగాహన కల్పించాల్సి ఉంది. ఉదయం వేళల్లోనే పనులు చేసేలా చర్యలు తీసుకోవాలి. ఉదయం 7:00 గంటలలోపు పనుల వద్దకు వచ్చి 11:00 గంటల వరకు పనులు పూర్తి చేసేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవల్సి ఉన్న అమలు కావడం లేదు. కొన్ని గ్రామాల్లో కూలీలు ఎండలకు పనులు చేస్తూ నీరసించి పోతున్నారు. నీడ వసతి కోసం ఆయా గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లకు ఒకటి రెండు టెంట్లు ఇచ్చి వంతుకు గంతేసినట్లు వ్యవహరిస్తుండటంతో కూలీలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. మర్రిపల్లిలో రెండు, మూడు చోట్ల పనులు జరుగుతుండగా నీడ కోసం ఒక షెడ్‌నెట్‌ను ఫీల్డ్ అసిస్టెంట్‌కు అందజేస్తే అది ఏ పనిచోట ఏర్పాటు చేసే పరిస్థితి లేదు. దాదాపు అంతటా ఇదే పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల పనుల వద్ద తాగునీరు సరిగా లేక కూలీలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పనుల వద్ద కనీస వసతులు కల్పించడంతోపాటు రెండు వారాలకు ఒకసారి చేసిన పనులకు వేతనం డబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు.

కనీస సౌకర్యాలు లేవు



ఉపాధి పనుల వద్ద కనీస వసతులు కల్పించడం లేదు. కొన్ని చోట్ల పనులు చేసే చోట సమీపంలో చెట్లు లేకపోవడంతో నీడ వసతి లేక ఇబ్బంది పడుతున్నాం. ఈ ఏడాది ఎండలు తీవ్రంగా ఉన్నాయి. మొదట్లో పనులు వద్ద కనీసం ప్రథమ చికిత్స కోసం కిట్లు అందుబాటులో ఉంచేవారు. ఇప్పుడు అవి కూడా లేవు. చేసిన పనులకు కూలీ డబ్బులు సకాలంలో ఇవ్వడంలేదు.

– వర్థం వెంకటమ్మ, ఉపాధి కూలీ, మర్రిపల్లి

ప్రత్యేక దృష్టి పెట్టాం..

ఉపాధి పనుల వద్ద మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాం. చెట్లు లేని చోట నీడ కోసం నెట్లు ఏర్పాటు చేసి నీడ వసతి కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించాం. ఓఆర్ఎస్ పాకెట్లు ప్రతి గ్రామ పంచాయతీలో అందుబాటులో ఉంచాం. సంబంధిత గ్రూపు మేటీలను తీసుకెళ్లి పనుల వద్ద ఉంచాలని చెప్పాం. తాగునీరు కూలీలే సమకూర్చుకుంటున్నారు. ఆ డబ్బులు కూలీతోపాటు కలిపి ఇస్తున్నా.

– పర్వతాలు, ఇన్‌చార్జ్ ఈజీఎస్ ఏపీఓ, ఉప్పునుంతల

హామీలు అమలులో కాంగ్రెస్ విఫలం


మాట్లాడుతున్న గంగిశెట్టి నాగరాజు

చారకొండ: హామీలు అమలులో కాంగ్రెస్ విఫలం అయ్యిందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ మండల నాయకులు సమావేశం అయ్యారు. సమావేశంలో మండలంలోని పార్టీ బలోపేతం, ఇతర అంశాలపై చర్చించారు. నాయకులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయడం లేదని విమర్శించారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కృష్ణ, నాయకులు మల్లేష్, శరత్, వేణు శర్మ, నరసింహ, శివ, పూల్‌సింగ్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

అసంపూర్తిగా ఇందిరా క్రాంతి భవనం


తాడూరులో స్లాబ్ దశలో ఉన్న భవనం

తాడూరు: మండల కేంద్రంలో 15 ఏళ్లలో రూ.18 లక్షలతో నిర్మించిన ఇందిరా క్రాంతి భవనం అసంపూర్తిగా నిలిచిపోయింది. భవనం స్లాబ్ వరకు పనులు చేసి వదిలేశారు. ఉపాధి హామీ, ఐకేపీ సిబ్బంది విధులు నిర్వర్తించేందుకు భవన నిర్మాణం చేపట్టారు. కాని భవనం పనులు అర్ధాంతరంగా నిలిచిపోయి శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఇరుకుగదుల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటికైనా అసంపూర్తిగా నిలిచిన భవన నిర్మాణ పనులు పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

నల్లబెల్లం, సారా పట్టివేత



నాగర్‌కర్నూల్ క్రైం: అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం, సారా, పటికను ఆదివారం పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ కల్యాణ్ తెలిపారు. బిజినేపల్లి మండలం వట్టెం గ్రామానికి చెందిన గుబ్బ శివకుమార్ హైదరాబాద్ నుంచి ఓమ్ని వ్యాన్‌లో 432 కిలోల నల్లబెల్లం, 10 కేజీల పటిక, 5 లీటర్ల సారాను అక్రమంగా తరలిస్తున్నాడు. మున్సిపాలిటీ పరిధిలో ఎండబెట్ల వద్ద స్టేట్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ బాలరాజు ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీలో పట్టుబడ్డాడు. వాహనాన్ని స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. గుబ్బ శివకుమార్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. తనిఖీలలో స్టేట్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ టీం సిబ్బంది హనీఫ్, సాయికిరణ్, కౌశిక్, నితిన్, శంకర్ పాల్గొన్నారు.

కాల్వ ఆధునికీకరణ పనుల పరిశీలన



కొల్లాపూర్: పట్టణంలోని 16వ వార్డులో రూ.కోటి వ్యయంతో చేపట్టిన ప్రధాన మురుగుకాల్వ ఆధునీకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. అన్నపూర్ణ లాడ్జి సమీపం నుంచి వరిదేల చెరువు కట్ట వరకు మురుగుకాల్వ పనులు ఆధునీకరణ చేస్తున్నారు. ఇందులో భాగంగా బాబూ జగ్జీవన్‌రామ్ చౌరస్తా నుంచి కేఎల్ఐ అతిథి గృహం వరకు సీసీ రోడ్డు వరకు నిర్మాణాలు పూర్తి చేశారు. పనులను 16వ వార్డు మాజీ కౌన్సిలర్ సిబ్బంది నర్సింహారావు పరిశీలించారు. పనులను నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టు కంపెనీ ప్రతినిధులకు సూచించారు. ఆయన వెంట నాయకులు బోరెల్లి మహేష్, పసుల వెంకటేష్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కారు బోల్తా



చారకొండ: కారు అదుపుతప్పి బోల్తాపడిన ఘటన మండల కేంద్రంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ శంషోద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన ప్రియగుప్త శ్రీశైల పుణ్యక్షేత్రానికి కుటుంబ సభ్యులతో కలిసి బయలు దేరారు. మార్గమధ్యలో వంగూరు మండలం శ్రీశైలం క్రాస్ వద్ద దారి తప్పి నేరుగా చారకొండ వైపు వచ్చి మండల కేంద్రంలో ఓ మట్టికుప్పను ఢీకొని కారు బోల్తాపడింది. వెంటనే ఎయిర్ బెలూన్ ఓపన్ కావడంతో కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ప్రమాదంలో కారు ముందు భాగం ధ్వంసం అయ్యింది. ఘటన స్థలాన్ని ఎస్ఐ, సిబ్బందితో పరిశీలించి, పంచనామా నిర్వహించారు.

పెద్దమ్మగుడిలో చోరీ

అచ్చంపేట రూరల్: మండలంంలోని హాజీపూర్ పెద్దమ్మ గుడిలో శనివారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియాని వ్యక్తులు ఆలయ ద్వారానికి ఉన్న తాళాన్ని విరగ్గొట్టారు. ఆలయంలోని అమ్మవారి విగ్రహం మెడలో ఉన్న బంగారు ఆభరణాలు, హుండీని పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. ఆదివారం గ్రామస్తులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మద్యం బాటిళ్లు ఇవ్వలేదని అధికారి ఆక్రోశం

నాగర్‌కర్నూల్ క్రైం: ఉచితంగా మద్యం బాటిళ్లు ఇవ్వలేదని జిల్లా కేంద్రంలోని ఓ అధికారి ఆక్రోశంతో ఊగిపోయాడు. వైన్ దుకాణానికి తాళం వేయాలని హుకుం జారీ చేశాడు. నిర్వాహకులను భయభ్రాంతులకు గురిచేశాడు. చేసేదేమి లేక మద్య దుకాణ నిర్వాహకుడు దుకాణానికి తాళం వేశాడు. ఓ గంట తర్వాత అధికారి వెళ్లిన తర్వాత దుకాణాన్ని తెరిచాడు. అప్పటికే మద్యం కోసం మద్యం ప్రియులు దుకాణం వద్ద గంట పాటు వేచిచూశారు. ఓ శాఖకు చెందిన అధికారి ఐదు మద్యం బాటిళ్లు ఇవ్వకపోతే ఇలా దుకాణాదారుడిని బెదిరించడం సరికాదని స్థానికులు పేర్కొన్నారు. అధికారి వైఖరిపై సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఘటనపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి మద్యం బాటిళ్ల డిమాండ్ చేసిన అధికారిపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

సత్తాచాటిన గురుకుల విద్యార్థినులు


నందిని


సింధు

కల్వకుర్తి టౌన్: ప్రభుత్వం నిర్వహించిన టీజీఈఏపీ సెట్‌లో పట్టణంలోని గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాల విద్యార్థినిలు సత్తాచాటారు. ఎంపీసీ, బైపీసీ విభాగాలకు నిర్వహించిన పరీక్షలలో ఆయా విభాగాలలో ఉత్తమ ర్యాంకులను సాధించారు. గురుకుల పాఠశాలలలో చదువుతున్న విద్యార్థినులలో బైపీసీ విభాగం అగ్రికల్చర్‌లో సభావత్ సందిని 4523, నందిని 5745, సుమిత్ర 6908, సునిత 7407 రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. బైపీసీ విభాగం ఇంజనీరింగ్‌లో సింధు 9308 రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించింది. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను పాఠశాల లెక్చరర్లు, విద్యార్థినిల తల్లిదండ్రులు అభినందించారు.

శాస్త్రోక్తంగా రాజగోపుర కలశ ప్రతిష్ఠ


కలశాలను పూజలు చేస్తున్న హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతిస్వామి

కొల్లాపూర్: కొల్లాపూర్‌లోని అన్నపూర్ణ అమరేశ్వర స్వామి(శివాలయం) ఆలయ రాజగోపుర కలశ ప్రతిష్ఠ ఆదివారం ఉదయం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మూడు రోజులుగా కలశ ప్రతిష్ఠ మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇటీవల నూతనంగా నిర్మించిన రాజగోపురానికి పూజలు చేశారు. కలశ ప్రతిష్ఠ మహోత్సవానికి హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతీస్వామి హాజరయ్యారు. ఆలయ ట్రస్టీ బాలాదిత్య లక్ష్మారావు కలశాన్ని ఎత్తుకొని రాజగోపురం వద్దకు తీసుకువచ్చారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య విద్యారణ్య భారతీస్వామి కలశాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం ఆయనను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సత్కరించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ నాయకులు కాల్వగడ్డ ప్రభాకర్‌శెట్టి, గుంత బాలయ్య, ఇటుకల బాలరాజుయాదవ్ తోపాటు శివభక్తులు, హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం


తాడూరు మండలం సిర్సవాడలో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు


తిమ్మాజిపేట మండలం అప్పాజిపల్లిలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

తాడూరు: మండలంలోని సిర్సవాడలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనర్సింహ స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి కల్యాణం తిలకించి తరించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, అర్చకులు ఉన్నారు.

నాగర్‌కర్నూల్‌లో..

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ క్రాస్ రోడ్ వద్ద ఉన్న లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో ఆదివారం స్వామివారి జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, కుంకుమార్చనలు, విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో కాశంశెట్టి విజయలక్ష్మి, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు

తిమ్మాజిపేట: మండలంలోని అప్పాజిపల్లి గుట్టపై స్వయంభూ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయంలో పలువురు భక్తులు యజ్ఞ హోమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. చిలుక వివేకరెడ్డి దంపతులు బహూకరించిన ఇత్తడి తొడుగులను ఆలయ ఆవరణలో ధ్వజ స్తంభానికి అలంకించారు. సాయంత్రం స్వామి వారి కల్యాణోత్సవ కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు హరినామ స్మరణతో పులకించి పోయారు. చిలుక సురేందర్‌రెడ్డి, చిలుక రాజేందర్‌రెడ్డిలు రెండోరోజు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాందేవ్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, సురేందర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అనంతరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉత్సవాలు

వెల్దండ: మండలంలోని బైరాపూర్‌లో లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవాలలో భాగంగా ఉదయం అభిషేకం, నిత్యహోమం, పూర్ణాహుతి తదితరులు కార్యక్రమాలు కొనసాగాయి. రాత్రి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో జగన్మోహన్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు శేఖర్‌శర్మ, గోపిశర్మ, నరహరిశర్మ తదితరులు ఉన్నారు.

అధ్వానంగా ప్రధాన రహదారి


సీతారాంపూర్ వద్ద కొట్టుకుపోయిన బీటీ

బల్మూర్: మండలంలోని అచ్చంపేట–బల్మూర్–లింగాల ప్రధాన రహదారిలోని సీతారాంపూర్ బస్‌స్టేజీ వద్ద వర్షం ధాటికి రోడ్డు కొట్టుకు పోయి గుంతలమయంగా మారింది. బల్మూర్, లింగాల మండలాలకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గ్రామంలో నుంచి వచ్చే వర్షం నీరుతో పాటు మురుగు నీరు కూడా రోడ్డుపై నుంచి పారుతుండటంతో బీటీ ఆనవాళ్లే కన్పించడం లేదు. గుంతలు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళ వాహనాదారులు ప్రమాదాలబారిన పడి గాయాలైన ఘటనలు ఉన్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో కల్వర్టు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

యువతి అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: యువతి అదృశ్యమైన ఘటనలో ఆదివారం కేసు నమోదైందని ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం మండలంలోని గుడిపల్లి గ్రామానికి చెందిన లలిత(19)ఈ నెల 10న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లింది. బాధిత కుటుంబసభ్యులు ఎంత వెతికినా యువతి ఆచూకీ లభ్యం కాలేదు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

మన్ననూర్: అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ జన్మదిన వేడుకలను ఆదివారం మన్ననూర్‌లోని ఓం చౌరస్తాలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. పంబలి బుచ్చయ్య, హన్మంత్‌రెడ్డి, సంబు శోభ, సుజాత, మంజుల, వెంకటేశ్వర్లు, వెంకటరమణ, రహీం, శ్రీనివాసులు, రవి బాలమ్మ, ఇస్మాయిల్, వెంకటయ్య, శివాజీ, శ్యాం సుందర్, మధు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో దోపిడీని అరికట్టాలి

పాన్‌గల్: వరి కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు చేస్తున్న దోపిడీని అరికట్టాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కాకం బాలస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కార్యకర్తలతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ధాన్యం కాంటా చేసే క్రమంలో ఖాళీ సంచి పేరుతో 600 గ్రాములు అదనంగా తూకం చేయాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా 1,250 గ్రాములు తూకం చేస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. దీంతో పాటు కేంద్రాల్లో ధాన్యం కాంటా చేసి మిల్లులకు తరలించిన తర్వాత మిల్లర్లు తాలు పేరుతో బస్తాకు కిలో చొప్పున తరుగు తీస్తూ.. రైతులను నట్టేట ముంచుతున్నారన్నారు. కేంద్రాల్లోని ధాన్యం కాంటాను వేగవంతం చేయాలని కోరారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దోపిడీని అరికట్టకపోతే రైతులతో కలిసి ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. క్రీడా ప్రాంగణాన్ని ప్రైవేటు వ్యక్తులు కూల్చివేసి నెలలు గడుస్తున్నా నేటికీ పునరుద్ధరించడం లేదన్నారు. సహదేవుడు, హన్మంతు, శంకరయ్య, బొజ్జన్న, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



కందనూలు: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2004–05 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి మిత్రులతో సంతోషంగా గడిపారు. కార్యక్రమానికి రిటైర్డ్ హెచ్ఎం పాండురంగయ్య, ఎంఈఓ భాస్కరాచారి, ఉపాధ్యాయులు తిరుపతయ్య, ఆనంద్, బాలాసాగర్, రామన్‌గౌడ్, సుభాష్ తదితరులు హాజరయ్యారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను విద్యార్థులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.